# అన్నదమ్ములు

శ్రీ మానూరు రామకృష్ణారావు

"నిజంగా చెప్పమ్మా నీ ముద్దుల కొడుకును నేనే కాదూ?" అని అడిగేవాడు గోపి

"నిజమే నమ్మా నీవే చెప్పు నీకు నేనంటే యెక్కువ యిష్టమో - గోపి అంటే యెక్కువ యిష్టమో అబద్ధం చెప్పకుండా నిజం చెప్పు" అని మధు గోపి ప్రశ్నకు జవాబు రాకముందే తల్లిని అడిగేవాడు

"సరే అయితే - యెవరి పేరు చెప్పమంటారో మీరే చెప్పండి" అని కమల నవ్వుతూ అడిగేది

"నీకు యెవరంటే యెక్కువ యిష్టమో వాడి పేరు నీవే చెప్పు" అని యిద్దరు ఏకకంఠంతో అరచేవారు

"అలాగయితే సరే చెప్తాలే కాని" అని కమల యేదో ఆలోచిస్తున్నట్లు నటించేది తల్లి యెవరి పేరు చెప్తుందో నని పిల్లలిద్దరు ఆత్రంతో యెదురుచూస్తూ కూచొనేవారు

"కాని ముందు మీరు చెప్పండి నామీద మీ యిద్దరిలో యెవరికి యెక్కువ ప్రేమ?" అని కమల తిరిగి ప్రశ్నించేది

"నాకు నీవంటే యెక్కువ యిష్టం" అనేవాడు గోపి

"నాకే యెక్కువ ప్రేమ" అనేవాడు మధు

"సరే నాకు కూడ అంతే మీ యిద్దరిమీద సమానంగా వున్నది నా ప్రేమ" అని నవ్వుకుంటూ జవాబు చెప్పేది కమల

తల్లిప్రేమ పరిమాణాన్ని దాని విలువను యీ పిల్లలిద్దరు కనీసం నాలుగైదు రోజులకొకమారైనా పరీక్షచేసి పరిచూసుకొని సంతోషించుకుంటుండడము వారికి పరిపాటే గాక అలవాటుకూడ అయిపోయింది ఆమె జవాబుతో యిద్దరూ కిలకిలా నవ్వుకుంటూ ఆమె ఒళ్లోకి ఒక్కమారు పోయి వాలడం వారి కార్యక్రమంలో క్రమము తప్పని నియమమైంది

* * *

గోపి, మధు అన్నదమ్ములు దాదాపు యిద్దరూ ఒక్క మోస్తరుగా వుండేవారు రూపరేఖలలోనేమి, వయసులోనేమి ఆఖరకు వాళ్లు ధరించే దుస్తుల్లో కూడ ఒకళ్లని చూస్తే మరొకళ్లని చూడవలసిన అవసరము లేనట్లుండేది సాధారణంగా చూచేవాళ్లకు వాళ్లు కవలపిల్లలేమోననే అనుమానము కలుగుతుంద నిజానికి వాళ్లు కవలపిల్లలు కాదు సరిగదా ఆఖరికి స్వంతిసోదరులు కూడా కాదు ఈ విషయము ఆ వూళ్లో ఎవరికి తెలియదు కమల యీ సంగతిని పిల్లలకు కూడ తెలియనియ్యక యిద్దరికీ యెటువంటి అనుమానము కూడ కలుగనియ్యక సమానప్రేమతో చూసుకుంటూ వుండేది గోపు, మధులు తమ బాల్యక్రీడలతో తల్లిహృదయానికి ఆనందము కలుగచేస్తుండేవారు

కొంచెము సూక్ష్మంగా పరిశీలించిచూస్తే మటుకు కమలకు గోపిమీదికంటె మధుమీదనే ఎక్కువ ప్రేమవున్నట్లు కానవస్తుంది బహుశా యిందుకు కారణం గోపి స్వభావములోను మధు స్వభావములోను వున్న వ్యత్యాసమే ఐవుండవచ్చును ఎందుచేతనంటే మధు చాలా నిదానస్తుడు కొంత అమాయకత్వముతో కూడిన నాజూకు స్వభావము కలిగి యేవిషయానైనా తల్లితో చెప్పకుండా చేసేవాడు కాదు ఎంత చిన్నపనికి కూడా తల్లిమీదనే ఆధారపడివుండేవాడు ఆమెను చూడకుండా ఎక్కువసేపు వుండలేకపోయేవాడు గోపి స్వభావము దీనికి పూర్తిగా వ్యతిరేకముగా వుండేది అతను కొంచెము గడుసు ఆటలలో మునిగిపోయాడంటే ఎంతకాలమైనా తల్లి-యిల్లుధ్యాసకూడా వుండేది కాదు తను చెయ్యదలచుకొనిన పనిని బ్రహ్మరుద్రాదు లడ్డమువచ్చినా పూర్తి చెయ్యనిదే వదిలేవాడు కాదు

కమల యెక్కడికైనా పనివుండిపోతే గోపి సాధారణంగా తోటిపిల్లలతో ఆడుకుంటూ యెక్కడికో సంచారానికి వెళ్లి కాలక్షేపం చేస్తుండేవాడు మధు మాత్రం యెక్కడికీ వెళ్ళక కమల వచ్చేదాక ఇంటి అరుగుమీద కూర్చొని ఆమెకోరకు నిరీక్షిస్తూ వుండేవాడు అంతదూరాన ఆమె కనపడగానే యెదురుగా పరుగెత్తుకొనిపోయి యెంతో కాలమునుండి వదలివున్నవానిలాగా ఆమెను అనుసరించి వచ్చేవాడు అతని ఈ సున్నిత స్వభావమువల్లనే కమలకు కూడా వాత్సల్యత కొంత యెక్కువగా మధు వైపుకే మొగ్గుగా వుండేది. అప్పుడప్పుడు యిరుగుపొరుగువారు కూడా "ఏమమ్మా కమలా, నీకు మధే ముద్దులకొడుకులాగా వున్నాడే" అనేవారు కమల యేమీ జవాబియ్యక వూరుకునేది కాని అటువంటి సమయాల్లో మాత్రం ఆమె మనోచక్రం గిర్రున తిరిగిపోయి పది సంవత్సరములనాటి భయంకర స్మృతిచిత్రం తన కళ్ళ యెదుట నిలచిపోయేది ఆ వృత్తాంతము నేటికి కూడా ఆమె స్మృతిపథంలో నూతనముగా నే వుండిపోయింది

పది సంవత్సరముల క్రిందటి సంగతి ఆ సమయములో కమల పురిటికి పుట్టింటకి వచ్చివున్నది ఆమెకు రెండుమాసముల పసిపిల్లవాడు బాల్యక్రీడలతో తన కాలమంతా గడిపిన ఆ గ్రామములో బంధువులు, స్నేహితుల మధ్య ఆమెకు ఆనందముగానే వుండేది కాని త్వరలోనే తన భర్త వద్దకు వెళ్లవలసివున్నది ఈ వాతావరణం నుండి వెళ్లటము - అందులో ముఖ్యముగా తన ప్రియసఖి కళ్యాణిని వదలి వెళ్ళటము కమలకు కష్టముగా వున్నది

కళ్యాణి కమల పినతండ్రి కుమార్తె చిన్నతనమునుండి యిద్దరూ చాల స్నేహముగా వుంటూవుండేవారు కాని పాపం కళ్యాణి దుఃఖజీవి ఆమె జీవితగాథ కమలను కల్లోలపరచింది కళ్యాణికి కూడ నాలుగు మాసముల పసిపిల్లవాడున్నాడు తన పెళ్లి అయిన కొద్దికాలానికే ఆమె తలితండ్రులు చనిపోయారు ఆమె అత్తవారింట అనేక కష్టము లనుభవిస్తూవున్నా తన భర్తకు ఆనందము కలుగజేసేందుకు అనేకవిధముల ప్రయత్నించింది కాని అతనుకూడ దుస్సహావాసములకు లోనై ఆమెను నానా హింసలు పెట్టాడు చివరకు యింట్లోనుండి వెళ్ళగొట్టే ప్రయత్నములో వున్నారని తెలిసి కమల తండ్రి ఆమెను తన యింటకి తీసుకొని వచ్చి ఆదరించారు ఇక నామెకు పుట్టింటి

వారితరఫున పెదతండ్రి తప్ప వేరెవ్వరూ ఆధారము లేకపొయ్యారు ఆమె భర్త మరల తనవద్దకు తీసుకొనిపోయే ప్రయత్నము చేయలేదు కొన్ని పర్యాయములు ఆమే స్వయంగా వెళ్లినా అతడు చేరనియ్యలేదు అందుచేత ఆమె మనోవ్యధతో అవమానంతో క్రుసించుతూ పెదతండ్రి వద్దనే వుండవలసివచ్చింది

ఆరోజు రాత్రి గాఢాంధకారము భయంకరంగా నలువైపులా అలముకొని పోయి వుంది. ఈదురుగాలి జోరున వీస్తోంది వర్షము తెరిపి లేకుండా కురుస్తోంది అప్పుడప్పుడు ఉరుములు ఆ భయంకరరాత్రిని మరింత భయంకరంగా చేస్తున్నయి సన్నని బంగారుతీగల్లాంటి విద్యుల్లతలు తళుక్కున మెరసి వెంటనే ఆ నల్లటి గాఢాంధకార గర్భంలో లీనమై పోతున్నయి

ఒక ప్రచండ మేఘగర్జన ధ్వనికి కమలకు హఠాత్తుగా మెలుకువ వచ్చింది వాయువుప్కృతం యింకా తగ్గలేదు ఆ గాలిలో యెక్కడో ఒక తెరచుకొనిన తలుపు దబా దబా కొట్టుకొనే ధ్వని వినవస్తుండెను కమలకు అంతా యేమో అయోమయంగా భయంగా వుంది ఇంతలో కళ్యాణి గదిలోనుంచి ఆమె పిల్లవాని యేడ్పు కమల చెవులకు తగిలింది రెండు మూడు నిమిషాలు చూసింది ఇంకా ఆపిల్లవాడు యేడ్పు ఆపలేదు ఐదు నిమిషాలు అయింది పదినిమిషాలుకూడా గడచిపోయింది అయినా ఆ పిల్లవాడు యేడ్పు చాలించలేదు పోనుపోను యింకా బిగ్గరగా గుక్కపెట్టి యేడుస్తున్నాడు కమలకు యిదంతా ఒక వింతగా తోచింది పక్కలో పిల్లవాడు యింత బిగ్గరగా యేడుస్తున్నా మెలుకువ రానంత గాఢనిద్ర కళ్యాణికి యెలా పట్టిందా అని కమలకు ఆశ్చర్యం వేసింది ఆమె మంచముమీద నుంచి లేచింది కుర్రవాడు యింకా యిల్లెగిరి పోయేట్లు యేడుస్తూనే వున్నాడు కళ్యాణి గది తలుపు గాలికి కొట్టుకుంటూనే వుంది ఆమె మెల్లగా కళ్యాణి గదిలోకి పోయి మంచంమీద చూసింది అక్కడ ఆమె కనపడలేదు బహుశా ఆమె నీళ్లగదిలోకి యేమైనా పోయివుండవచ్చునని భావించి యేడుస్తున్న కుర్రవానిని యెత్తుకొని సమాధాన పరచింది పావుగంట దాటిపోయినా కళ్యాణి వచ్చేజాడే కానరాలేదు కుర్రవాడు యేడ్చి యేడ్చి అలసి కమల భుజంమీదనే నిద్రపోయాడు అందుచేత వాడిని మంచముమీద పరుండబెట్టుండగా దిండుమీద ఒక చీటి కనిపించింది అది కళ్యాణి స్వదస్తూరితో తన పేర వ్రాసిన చీటి అని చూసి తెలుసుకొని ఆశ్చర్యంతో మనస్సులో యేదో చెప్పరాని ఆవేదన కలతపెట్టుతున్నా ఆచీటి చదువసాగింది అందులో కళ్యాణి యిలా వ్రాసింది

"ప్రియమైన కమలకు

నేను చేస్తున్నది ఒక ఘోర భయంకర పాపకార్యమని తెలిసికూడా చేస్తున్నాను నాకు యీ దౌర్భాగ్య దుఃఖ జీవనము దుర్భర మవటంవలన చివరకు యీ లోకాన్ని వదలి వెళ్లేందుకు నిశ్చయించుకొన్నాను కాని వెళ్లేందుకుకూడా ఒక్క పెద్దసమస్య అడ్డు తగులుతుంటేది అది యేమిటంటే నా పసిపాప నీవు తప్ప నన్ను ఆదరించి అభిమానించిన ఆప్తులు నా కింక ఎవరున్నారు? నిన్ను గాక మరెవరిని సహాయము కోరగలను? అందుచేత యీ పసిగుడ్డును నీ ఒళ్ళో వేసి నేను శాశ్వతంగా సెలవు తీసుకుంటున్నాను ఇదే నా ప్రేమస్మారకంగా భావించి నీప్రేమ పరిధానాన్ని వానిమీద కప్పి నీ స్వంత వాణ్ణిగా చేసుకో కమలా ఇక సెలవు

ఇట్లు నీ అభాగ్యసోదరి

కళ్యాణి

ఈ వుత్తరం చదువుచుండగనే కమల చేతులు కంపించినయి దుఃఖము భరింపలేకపోయింది అప్రయత్నంగా ఆ వుత్తరం క్రింద పడిపోయింది మాతృప్రేమ సౌఖ్యానికి నోచుకొనని ఆ అభాగ్య శిశువును ఒక్కమారు గట్టిగా తన హృదయానికి హత్తుకొన్నది పాపం కళ్యాణి తుదకు ఆత్మనాశనానికే సాహసింపజేసిన యెంతటి దుర్భరపరిస్థితులు ఆమె జీవితాన్ని ముట్టడించినయో కమలకు గోచరము కాలేదు తనవంటి ఆప్తమిత్రురాలికి కూడా కళ్యాణి తన మనస్సు తెలుపనందుకు ఆమె చాల విచారించింది ఆమె వెంటనే వెళ్లి యింట్లోనివారి నందరిని మేల్కొలిపింది ఆ చీకటిలో – ఆ భయంకర వాతావరణంలోనే నలుగురు నాల్గువైపులా కళ్యాణిని వెతుక నారంభించారు దగ్గరలోనే వున్న చౌకీదారు తనకు అర్ధరాత్రి సమయములో అక్కడి భావిలో అకస్మాత్తుగా ఏదో పడిన ధ్వని వినవచ్చిందని చెప్పాడు కొందరు వెళ్లి తాళ్లు గాలాలు తీసుకొని ప్రయత్నించారు కాని ఆ చీకటిలో వారికి యేమీ తగలలేదు మరునాడు మధ్యాహ్నం ఆ భావిలోనే కళ్యాణి శవము తేలింది కమల దుఃఖముతో క్రుంగిపోయింది ఆమె తలితండ్రులు అవమానంతో దుఃఖముతో చాల కలతచెందారు

ఇక ఆ గ్రామములో స్త్రీలలో అనేకరకాల మాటలు బయలుదేరినయి ఒకామె అన్నది "పాపం కళ్యాణి బ్రతికిఉన్నంతకాలము కొంచెమైనా సుఖానికి నోచుకోలేదుకదా! ఆమె భర్త చూడు ఎలాంటి దుర్మార్గుడో! వట్టి రాక్షసుడు!! అక్కడ వున్నంత కాలము కాల్చుకొని వేధించాడు! పాపం యీ యమయాతనలనుంచి విముక్తిచేసుకొని పోవటమే మేలైంది"

మరొకతె యిలా అన్నది "ఆహా! ఏమి తెలివిగా మహా తెలిసినదానిలాగా మాట్లాడుతున్నావే! ఆయన చాలా మంచివాడు ఈమెగారే యింకెవరో మరిగి ఆయన్ను నిర్లక్ష్యపరచింది ఇప్పుడు పుట్టిన పిల్లవాడు కూడా ఆయనగారి అనుగ్రహమేనట! అందుకనే మళ్లా మొగుడికి ముఖం చూపేందుకు ధైర్యము చాలక చివరకు యిలా చేసుకున్నది"

ఈవిధంగా యిలాంటివే అనేకరకాల వాదప్రతివాదనలు కళ్యాణిమృత్యువును గురించి చర్చింటములో ఆ గ్రామవనితలు తమ అఖండకల్పనాసామర్థ్యాన్ని ప్రకటించారు ఇటువంటి శుష్కవిమర్శనలు కమలను చాల కలవరపరచినయి కారణమేదైనా కాని తనకు తన జీవనము దుస్సహమని తోచుటచేతనేగదా కళ్యాణి పసిపాపను సైతము వదలి యిట్టి సాహసానికి పూనుకొన్నది

ఆ రోజునుంచి కమల కళ్యాణి కుమారునివలె అత్యంత ప్రేమతో పెంచుతూ వచ్చింది మరల తన భర్తవద్దకు వచ్చేటప్పుడు యిరువురు బిడ్డలతో వచ్చిన ఆమెను చూచి ఆ గ్రామస్తులందరు వారిద్దరు ఆమె కవలపిల్లలని భావించారు ఆశ్చర్యచకితుడైన తన భర్తకు కళ్యాణి వుత్తరము చూపి తన సోదరి అంతిమ వాంఛను పరమ పవిత్రకర్తవ్యముగా పాలించేటట్లు అంగీకరింప చేసింది ఆ పిల్లలిద్దరు స్వంతసోదరులుగా మెలుగుతూ దినదినాభివృద్ధి చెందుతూ వున్నారు

ఈ సంఘటన కమలకు యెప్పుడూ నిత్యనూతనంగానే వున్నది

## 2

కాలగమనంలో పదిసంవత్సరాలు ఇట్టే గడచిపోయినయి గోపి, మధులు పరస్పరాభిమానాలతో వుంటూ చదువుకుంటు


### నారసింహ లేహ్యము

బంగారు చేర్చబడినది మేహము, నిక్కాక, నిస్సత్తువ శుక్లనష్టమును హరించి బలమును, కాంతిని, వీర్యవృద్ధిని కలిగించు వరప్రసాదము—

20 తు|| డబ్బి రు 3-4-0 పోస్టేజి 10 అ

పి సి పి & కంపెని 'ఆయుర్వేదసమాజం"

దేపి-పెరి నెల్లూరు జిల్లా

న్నారు ఆ సంవత్సరం మళ్లా కమల పుట్టింటికి వచ్చింది అంతవరకు ఆ పిల్లల మనస్సులకు తాము స్వంతసోదరులు కారనే సంశయము ఎంతమాత్రము వుత్పన్నమై వుండలేదు

కమల వచ్చిన మరునాడు పొరుగింటి అవ్వగారు ఆమెను చూచేందుకు వచ్చింది "అబ్బో చాలా కాలానికి వచ్చావే అంతా కులాసాగా వున్నారు గదా?" అంటూ కుశల ప్రశ్న వేసింది

"మీదయవల్ల అంతా క్షేమమేన"ని కమల జవాబిచ్చింది

"మరి నీ కొడుకు బాగా చదువుతున్నాడా?" అని రెండవప్రశ్న వేసింది "బాగానే చదువుతున్నాడ"ని కమల ప్రత్యుత్తర మిచ్చింది

"సరేగానీ " అంటూ ఆమె పిల్లల మీదనే చూపు నిలిపి యేదో అడగబోతున్నది ఇప్పుడు ఆమె యేమి అడుగుతుందో కమలకు తెలిసిపోయింది "చాలా మారిపోయారు గదూ పిల్లలు గుర్తుపట్టలేక పోతున్నాను ఎప్పుడో రెండు నెలల పిల్లలప్పుడు చూశాను అయితే—" అవ్వగారి మాటలకు కమల అడ్డమువచ్చి "ఒరే మధూ— గోపీ మీరు లోపలికివెళ్లి ఆడుకోండి— పోండి" అని కొంచెం బిగ్గరగా అరచింది

తల్లిమాట ప్రకారం పిల్లలు లేచి వెళ్లబోతుండగా అవ్వగారు అడగదలచిన ప్రశ్న అడగనే అడిగింది "అయితే—వీళ్లలో నీ కొడుకెవరు? కళ్యాణి కొడుకెవరు?—"

అవ్వగారు వేసిన యీ ప్రశ్న చెవిన పడగానే పిల్లలిద్దరు దిగ్భ్రమతో నిలచి వెనుకకు తిరిగి చూశారు గోపి మాత్రం కలవరపాటుతో కమలవైపు చూశాడు కాని కమల వెంటనే "గోపీ - నీకు వినపడటం లేదూ లోపల అత్త యెందుకో నిన్ను పిలుస్తున్నది వెళ్లు త్వరగా" అని గదిమింది

పిల్లలు లోపలికి పోయారు గాని వాళ్ళ కాళ్లు తడబడుతూనే వున్నవి దీని పరిణామము వారి లేత మనస్సులలో యేవిధంగా అవుతుందోనని కమలకు వ్యాకులము కాజొచ్చింది అవ్వగారి పని పూర్తయినట్లు ఆమె వెళ్లేందుకు లేచింది

"పిల్లలకు యింకా వాళ్లు స్వంత అన్నదమ్ములు కారనే సంగతి తెలియదు నేను వాళ్లిద్దరిని ఒక్క విధంగానే చూసుకుంటున్నాను వాళ్లు బహుశా మీ ప్రశ్న వినే వుంటారేమో?" నని కమల అన్నది

"ఆ అందులో యేముంది? వెనుకో ముందో యీ విషయము యెప్పటికైనా తెలియక పోతుందా?" అన్నది అవ్వగారు

"ముందు యెప్పుడైనా తెలిస్తే తెలియనియ్యండి కాని వీళ్ళింకా పసివాళ్లు అమాయకులు వాళ్ల మనస్సు లింకా సున్నితంగా వుంటయి అందుకని వాళ్లకు బాగా వూహ తెలిసేదాకా యీ సంగతి తెలుపకూడదని నిశ్చయించుకున్నాను" అన్నది కమల

"ఓహో - అలాగా అయితే నాకేం తెలుసు నీ అభిప్రాయం నేనేదో సహజంగా మామూలు మాటగా అడిగాను" అంటూ మూతిముడుచుకొని అవ్వగారు లేచి వెళ్లిపోయింది అయినా కమల మనస్సులో మాత్రం ఏదో వక విలక్షణమైన ఆందోళన ప్రారంభమైంది

రాత్రి భోజనాలైనాక మధు గోపు యిద్దరూ వచ్చి తల్లికి చెరోకవైపు యిరికారు కొంచెం సేపయినతర్వాత గోపి అడిగాడు

"అమ్మా ఆ కళ్యాణి యెవరు?"

"ఏ కల్యాణి - ఎవరో నాకు తెలియదే" అని కమల తొట్రుపాటుతో అనింది

"ప్రొద్దున ఆ పొరుగింటి అవ్వగారు అడగలేదూ నిన్ను - వీళ్ళల్లో నీ కొడుకెవరు - కళ్యాణి కొడుకెవరు - అని? అదే ఆ కళ్యాణో-ఎవరమ్మా ఆమె?" అని మధు వివరంగా ప్రశ్నించాడు

"ఒహో - అదా సంగతి! సరే అదంతా ఒక పెద్దతమాషాలే కళ్యాణి నా స్నేహితురాళ్ళలో ఒకతె చిన్నతనంలో మేమంతా ఒక గమ్మత్తు చేసేవాళ్లము అవ్వగారు అడిగింది ఆ గమ్మత్తునుగురించే" అని యేదో సమాధానం చెప్పింది కాని ఆ పిల్లలకు తమ తల్లి ఏదో అబద్ధము చెప్తున్నదనే అనుమానం కలిగింది అందుకని యిద్దరు కూడా "ఆ గమ్మత్తేమిటో మాకు చెప్పమ"ని పట్టుపట్టారు

"మీరు యింకా చిన్నవాళ్లు చెప్పినా మీకు అర్థం కాదు పోనీ ఒక చిన్న తమాషా కథ చెప్పనా?" అని అడిగింది కమల

"మాకు కథవద్దు కాదు కాని యీ ఒక్క సంగతి చెప్పు మే మిద్దరము నీ కొడుకులము కామా?" అని మధు అడిగాడు ఆమె ఆశ్చర్యచకిత అయింది అప్రయత్నంగా ఆమె గోపివైపు చూచింది గోపికూడ వంటనే "నిజమేనమ్మా - మా యిద్దరిలో నీకొడుకు యెవరుకాదో అదన్నా చెప్పు" అని తెలివిగా అడిగాడు

కమల నిరుత్తర అయింది ఆమెకు వెంటనే ఆ భయానక సంఘటన స్మరణకు వచ్చింది లోపలి గుఃఖము పైకి కనపడనీయక "మీలో యెవరికి నేను మీ తల్లిని కాను అని తోస్తుందో నేను వాళ్ల తల్లిని కాను మరిప్పుడు మీరే చెప్పండి నే నెవరి తల్లినో?" అని అడిగింది

"నాకు తోచదు" అని గోపి వెంటనే అన్నాడు

"నాకూ తోచదు నీవు నా అమ్మవే బహుశా గోపి అమ్మవు కావేమో" అని మధు బిగ్గరగా అరిచాడు గోపికి వెంటనే కోపము వచ్చింది "ఏమీ కాదు అమ్మ నా అమ్మే 'నేనే యెక్కువ పోలికగా వుంటాను నీవే కళ్యాణి కొడుకువి" అంటూ మధును గట్టిగా వెనక్కు-తోశాడు పాపం మధు మాట్లాడకుండా లేచాడు కమల అతన్ని దగ్గరకు తీసి విసుగ్గా "ఏమిటి గోపీ నీ అల్లరి - వూరికే మాట మాత్రానికే అంత కోపగించుకుంటావు? - సరే యిప్పుడు చెప్పండి మీరు - అమ్మ అంటే యెవరు?" అని అడిగింది

"అబ్బ భలే ప్రశ్న వేశావే? అ దెవరికి తెలియదూ? ఎవరు తన బిడ్డల్ని కంటుందో ఆమే అమ్మ" అని గోపి జవాబు చెప్పాడు

"ఛా అదేంకాదు ఎవరి మనస్సులో తను తమ తల్లి అనే భావన కలుగజేస్తుందో ఆమెయే తల్లి" అని కమల అన్నది

"మరైతే మా యిద్దరికికూడా నీవే అమ్మవనే భావన కలుగుతున్నదిగా" అని మధు తన సందేహాన్ని వెళ్ళబుచ్చాడు

"అంతే మరి నేను మీ యిద్దరికీ అమ్మనేగా!" అన్నది కమల

"మరైతే ఆ కళ్యాణి యెవరు? అని మళ్లా ప్రశ్నించాడు గోపి

"ఎవ్వరూ కాదు అదంతా వట్టి తమాషా మీ రిద్దరూ నా కొడుకులే ఇక పోయి నిశ్చింతగా నిద్రపోండి" అని కమల వాళ్ళను బుజ్జగించి పంపింది వాళ్లు సమాధానపడి వెళ్లి నిద్రపోయారు కమల విచారంగా ఆలోచిస్తూ కూచున్నది

మరునాడు మళ్లా గోపిహృదయానికి తీవ్ర ఆఘాతము కలిగింది సాయంకాలము కొందరు పిల్లలతో గోడి - బిళ్ల ఆడుకొనేందుకు గోపీ-మధుకూడా వెళ్లారు అందులో ఒక కుర్రవాడు గోపును దగ్గరకు పిలిచి అడిగాడు

"ఓరే నీ పేరేమిట్రా?"

"గోపి"

"మరి ఆ అబ్బాయి పేరో?"

"మధు"

"సరే వా డెవరో నీకు తెలుసా?"

"వాడు నా తమ్ముడేగా!"

ఓహోహో - భలే భలే" అంటూ అప

(20-వ పేజీ చూడండి)

# అన్నదమ్ములు

(15-వ పేజీ తరువాయి)

హాస్య పూర్వకంగా నవ్వుతూ ఆ పిల్లవాడు అన్నాడు

"అయితే నీ కేమీ తెలియదన్నమాట నీ అమ్మపేరు కళ్యాణి పాపం ఆమె లేగు చనిపోయింది

"కళ్యాణా? కళ్యాణి లేదా?" గోపి హీనస్వరంలో తనలో తాను గొణుక్కున్నట్లు అన్నాడు కాని వెంటనే ఆ కుర్రవాడితో "నీకు యీ సంగతి యెలా తెలిసింది?" అని ఆతృతతో అడిగాడు

"బాగుంది నాకేమిటి - యీ సంగతి యీ వూళ్ళో అందరికీ తెలుసు కమలకు వున్నది ఒక్క కొడుకేను రెండవవాడు కళ్యాణికొడుకు "అన్నాడు ఆ కుర్రవాడు

గోపి లేత హృదయానికి దుస్సహ వేదన ఉత్పన్నమైంది అయినా పూర్తిగా సందేహ నివృత్తి కాలేదు మళ్ళీ యేదో ఆలోచించుకొని అడిగాడు "కాని - నేనే కళ్యాణి కొడుకునని ఎందుకు అనుకోటం - మధు కాకూడదా?"

"నీవు వట్టి పిచ్చివాడిలా వున్నావే? చూసేవాళ్లకు అంతమాత్రం తెలియదా ఏమిటి? మా అవ్వే చెప్పింది కమలకు మధుమీదనే ఎక్కువ అపేక్ష వున్నదని ఎంతయినా కూడ తల్లికి తన కన్నకొడుకు మీదనే ఎక్కువప్రేమ వుంటుందనే సంగతి అందరికీ తెలిసిందేగా!" అన్నాడు ఆ కుర్రవాడు

గోపి మనస్సులో యీ మాటలు బాగా నాటుకొని పోయినవి ఒకమారు వెనుకటి విషయాలన్నీ పునశ్చరణకు తెచ్చుకున్నాడు కమల తరుచు మధు పక్షం వహించి తనను కోపగించుకొనటం జ్ఞప్తికి వచ్చింది ఆ కుర్రవాడు యింకా యిలాగా చెప్పాడు

"ఈ కళ్యాణి కమలకు చెల్లెలు అవుతుంది ఒకరోజు రాత్రి ఆమె ఎందుకో భావిలోపడి చనిపోయింది నీ పోషణ బాధ్యత కమలమీద వేసింది ఆ సమయములో నీవు చాలా పసిపిల్లవాడివట కమలకు కూడా నీ యీడువాడే ఒక కొడుకు వున్నాడు వాడే మధు "గోపిచెవులకు యీ మాటలు వినపడుతున్నయి కాని మనస్సు వికలమైపోయింది చివరకు పిచ్చివానిలాగా హఠాత్తుగా లేచాడు అతని కళ్లలోనుండి అశ్రువులు సంతతధారగా ప్రవహిస్తున్నవి

కమల తన తల్లికాదు అనే సంగతే అతనికి ఒక పెద్ద దుఃఖసమస్య అయింది క్రిందటిరోజు కమల తనతో అబద్ధము చెప్పినందుకు ఆమెమీద అతనికి కోపము కూడ కలిగింది - అంతేకాదు అతని జీవితములో మొట్టమొదటి పర్యాయముగా అతనికి కమలమీద ఒక విధమైన అనాదరణ భావన కూడ కలిగింది దానికంటె తీవ్రముగా అతనికి మధుమీద మనస్సులో యిప్పుడు యీర్ష్యకూడ వుత్పన్నమైంది అతని కోమలహృదయం అంతులేని ఆందోళనతో చెదిరిపోయింది "మేము యిద్దరము అమ్మను ఒక్క విధంగా ప్రేమిస్తుంటే వాళ్లము అయినా తన కన్నకొడుక నేగదా ఆమె అతన్ని అంతగా ప్రేమిస్తున్నది మా "అమ్మే వుంటే -" అస్పష్టంగా అనుకున్నాడు చుట్టు ప్రక్కల ఒకమారు చూచాడు పిల్లలు దూరంగా ఆడుకుంటున్నారు మధు కూడ వాళ్లతో ఆడుకుంటున్నాడు అతనిని అక్కడే వదిలివేసి గోపి ఎక్కడికో దూరంగా వెళ్లిపోయాడు ఈ రోజుననే ప్రథమ పర్యాయంగా అతనికి పరాయి భావన కల్గింది ఈ ఒంటరిపాటు భావనతో అతని కంఠము వరకు నిండిన దుఃఖాన్ని ఆపుకోలేక ఏకాంతంగా కూర్చుని భోరున యేడ్చాడు ఏడ్చినతర్వాతనే అతని హృదయభారము కొంతవరకు తగ్గినట్లు అయింది

రాత్రి అత్యంత ఉదాసీనమనస్థితితో యింటికి వచ్చాడు కమల యీ విషయాన్ని అతని మొహం చూడగానే గ్రహించగల్గింది

"ఏం గోపీ - యెలాగో వున్నావు! ఏమైనా అయిందా నీకు?" అని అడిగింది

"నా కేమీ కాలేదే - బాగానే వున్నానే" అని గోపి మామూలుస్వరంలో యీ విషయాన్ని కప్పిపుచ్చదలచి అన్నాడు కాని అతనికంఠంలోని వణుకు స్పష్టంగా తెలుస్తూనే వుంది

"కాని నీ మొహం చూస్తే యేడ్చినట్లు కనపడుతున్నదే ఎందుకైనా యేడ్చావా యేంటి?"

"ఆ-ఏమీ లేదు వూరికేనే ఒక కుర్రవాడితో పోట్లాడాను ఇద్దరము కొట్టుకున్నాము" అని గోపి పూర్తిగా అబద్ధమాడాడు

"సరే యింతేనా అయితే పర్వాలేదు లే రా యిక భోజనానికి మధు నీకోసం కాచుకొని కూర్చున్నాడు" అని కమల గోపి వీపు నిమురుతూ లోనికి తీసుకొని వెళ్లింది

"వాడు అనవసరంగా నాకోసం యెందుకు కాచుకొని కూచోవాలి" అని మెల్లగా గొణుగుకుంటూ వచ్చాడు ఈ రోజు మామూలుగా కమలహస్తస్పర్శ అతనికి ఆనందాన్ని కలుగజేయలేదు ఏదో జ్ఞప్తికి వచ్చినవానిలాగా తటాలున తల్లి చేయి తీసివేసి ఆమెకంటె ముందుగా లోపలికి వెళ్లాడు [తరువాయి వచ్చేవారం]

## బాలలారా!

ఈ క్రింద కొన్ని ప్రశ్నలు ఉన్నాయి ఆ ప్రశ్నలకు వుత్తరాలు ఏడు అక్షరాల్లో మాత్రం వుంటాయి అవి చదవటానికి ముందు వెనకల వకటే రీతిగా వుంటాయి చెప్పకోండి మరి చూద్దాం?

1 సభలోవారిని నవ్వించే కవిని ఏమంటారు?

2 రంభకొప్పులో వుండే పూలదండ పేరు ఏమిటి?

3 శ్రీకృష్ణుడు ఎవరియింటిలో పెరిగాడు?


4 సీతాదేవి పెండ్లికి ఓలిగాయిచ్చిన విల్లు పేరేమిటి?

5 గానుగచెట్టు విత్తనానికి సంస్కృతంలో ఏమంటారు?

6 రాముడు ఎవరిసహాయంచేత రావణున్ని చంపాడు?

7 పరవాసుదేవుని పట్టణం పేరేమిటి?

(జవాబు 38-వ పేజీలో)



# అన్నదమ్ములు

శ్రీ మానూరు రామకృష్ణారావు

(గతసంచిక తరువాయి)

## 3

వారము రోజుల తర్వాత కమల తన యింటికి వెళ్ళిపోయింది క్రమక్రమంగా గోపి మునుపటిలాగా నవ్వుతూ ఆడుకుంటూ వుండసాగాడు తాను పరుడు, ఏకాకి అనే భావనలోని తీవ్రతకూడ చాలమట్టుకు తగ్గిపోయింది కమలయెడల కూడ వెనకటి వలెనే ప్రేమాభిమానాలతో వుండసాగాడు కాని ఒక విషయంమాత్రం కమల మనస్సును ఖేదపరచసాగింది అది గోపి-మధుల మధ్య ఏర్పడిన భేదాభిప్రాయాలు గోపికి మధుయెడల లోలోపల ద్వేషభావము రోజురోజుకు దృఢముగా యెక్కువ కాజొచ్చింది తాతగారింట్లోనుంచి తిరిగివచ్చినప్పటినుండి యీ మార్పు అతనిలో స్పష్టముగా గోచరమౌతోంది దానికి కారణము యేమై వుంటుందో కమల సరిగా గ్రహించలేకపోయింది అంతకు క్రితం యెంతో అన్యోన్యంగా వుంటూ వుండిన అన్నదమ్ములు యిప్పుడు ఒకరికొకరు దూరము కాసాగారు గోపి మధును ఒక గడ్డిపోచక్రింద లెఖ్ఖకట్టి అతనితో యెప్పుడూ యేదో వంకమీద పోట్లాడుతూ వుండేవాడు మధు చాల సరళస్వభావము కలవాడుఅవటమువల్ల యేమీ చెయ్యక ఎక్కువగా కమలను అంటిపెట్టుకొనివుండేవాడు ఆమె అతనిపక్షం వహించి గోపిని మందలిస్తుండేది అందుచేత గోపికి మధుమీది ద్వేషము నిప్పులో నెయ్యిపోసిన విధంగా యెక్కువ కాసాగింది

పిల్లలు పెరుగుతూవచ్చినకొలది వారి మనస్సులలోని వైషమ్యాలుకూడ తదనుగుణంగానే వృద్ధిఅవుతూవచ్చినయి రోజూ యెందుకో ఒకందుకు ఘర్షణ పడుతుండేవారు ఇది చూచి కమల చాల విచారించేది గోపికి అనేకవిధాలుగా చెప్పిచూసింది మంచి మాటలతో చెప్పింది కోపముతో దబాయించి చెప్పింది కాని అతని ప్రవర్తనలో యెటువంటి పరివర్తన కనపడలేదు అందుచేత యిక చేసేదేమీలేక నిరాశతో వూరుకున్నది

ఒకమారు అన్నదమ్ములిద్దరకు యెందుకో తగవు వచ్చింది గోపి దుడుకుగా వెళ్ళి మధును పడవేసి బలముగా కొట్టాడు మధు యేమీ చెయ్యలేక యేడుస్తూ యింట్లోకి వెళ్ళాడు కమల చూసి "ఏమిటి మధూ ఏమైంది ఎందుకు యేడుస్తున్నావ"ని అడిగింది

"అమ్మా- చూడు గోపి నాతో పోట్లాడి యెలా కొట్టాడో?" అని మధు ఏడుస్తూ అన్నాడు కమలకు కోపం వచ్చింది బిగ్గరగా గోపితో "ఏమిట్రా గోపి - నీవు పోనుపోను యింత తగవులమారిగా తయారవుతున్నావేం" అని అరచింది

అసలే ద్వేషాగ్నితో మండిపోతున్న గోపి యీ మాట వినగానే అన్నాడు "అవునులే నీవు ఎప్పుడూ అంతే మధునే వెనక వేసుకొని వస్తావు"

"వెనక వేసుకొని రాకపోతే యేం చెయ్యమంటావు? నీకు ఒకక్షణంకూడా వాడంటే పడకవచ్చింది వాణ్ణి అలా కొట్టి చంపుతూంటే చూస్తూ వూరుకోమన్నావా?" అన్నది కమల

"నీకు వాడి తగవులమారితనం అసలు కనపడనే కనపడదు వాడేం చేసినా వాడే మంచివాడు అయినా కూడా నీకు మొదటినుంచి మధుమీదనే ఎక్కువ ప్రేమ నేనంటే నీకు యిష్టమే లేదు" అని గోపి బిరుసుగా జవాబు చెప్పాడు

"నీకు యెందుకు యీ పిచ్చి అభిప్రాయమో నాకేమీ అరంకావటం లేదు లేనిపోని వేషాలు వెయ్యక బుద్ధిగా వుండు" అని కోపంతో మందలించింది

"నేనేమీ తెలివితక్కువవాణ్ణి కాను నేనే కాదు ఊళ్ళో అందరూ అంటూనే వున్నారు నీకు నామీదకంటె మధుమీదనే ఎక్కువ ప్రేమ" అని గోపి తన యీర్ష్యను ప్రకటించాడు

"అంటే నీ అల్లరి వాళ్ళకు తెలియదన్నమాట అయినా నీ వంత పిచ్చివాడవురా—నీకు యిప్పుడు యేమి చెప్తే యేమి అర్థమౌతుంది" అని కమల అతనిని సమాధానపరచ చూచింది కాని గోపికి యేమీ సమాధానము కాలేదు మధుమీద అతని మనస్సులో యీర్ష్య స్థిరంగా నాటుకొనిపోయింది 'మధు మంచివాడు కాకపోయినా అతనికి తల్లివున్నదికాబట్టి అతనికి అన్నివిధాలా సంరక్షణ వున్నది అతని దుస్వభావాన్ని అదే ఒక గొప్ప అందలాగా కప్పిపుచ్చుతున్నది తనకు యెవరూ లేకపోవటమువల్లనే కదా అతను మాటిమాటికి చీవాట్లు తినవలసివస్తున్నది' ఈ అభిప్రాయము కలుగగానే గోపి దుఃఖములో కుంగిపోయేవాడు

ఆ రోజు సాయంకాలము కమల వంటయింట్లో పనిలో నిమగ్నురాలై వున్నది. పిల్లలు ఆడుకొనేందుకు ఎక్కడకో బయటకువెళ్ళారు పొద్దుగూక వస్తున్నది ఇంతలో బయటనుంచి యెవరో తనను బిగ్గరగా పిలుస్తున్నట్లు కమలకు కేకలు వినవచ్చినవి

"కమలమ్మగారూ - ఏమండీ మధు అమ్మగారూ—" అని గట్టిగా పిలుపు వినపడ్డది కమల త్వరగా లోనుంచి పరిగెత్తుకొనివచ్చింది ఈలోగా మళ్ళా "ఏమండోయ్ మధుఅమ్మగారూ త్వరగా రాండి - మధును చూడండి" అని యెవరో అరిచారు కమల ఒక్క అంగలో ఆదుర్దాగా బయటకువచ్చింది ఎదురుగుండా యిద్దరు పిల్లలు మధును చెరొక భుజము పట్టుకొని లోపలకు యెత్తుకుని వస్తున్నారు ఆమె యిది చూడగానే వెంటనే "అయ్యయ్యో, ఏమయింది నా మధుకు" అని పరిగెత్తుకొని వెళ్ళి మధును పట్టుకొన్నది మధు యెడమకణతకు కంటిదగ్గరగా ఒక పెద్ద రంధ్రముపడి అందులోనుంచి నెత్తురు ప్రవాహముగా కారిపోతున్నది మధు మెల్లగా మూల్గుతున్నాడు తల్లిని చూడగనే దుఃఖము ఆపుకోలేక యేడ్చాడు కమల వాణ్ణి ఓదారుస్తూ కన్నీరు తుడుస్తూ అడిగింది

"ఎలా తగిలింది మధూ నీకు యింత దెబ్బ?"

"గోపి రాయితీసుకొని కొట్టాడు" అని ఒక కుర్రవాడు భయపడుతూ చెప్పాడు

"నిజమే నమ్మా - గోపి కొట్టాడు" అని మధు ఏడుస్తూనే చెప్పాడు ఆ పిల్లలు కమలతో అసలు విషయమంతా చెప్పారు.

"పిల్లలందరము కొలను ఒడ్డుకు ఆడుకొనేందుకు వెళ్ళాము అక్కడ ఒక పెద్ద మామిడిచెట్టు వున్నది ఆచెట్టు చిటారు

కాస్తున్న ఒక మంచి మామిడికాయల గుత్తి వేళ్ళాడుతోంది  చెట్టు ఎక్కకుండా క్రింద నుంచే రాళ్లతో కొట్టి ఆ కాయలు రాల్చాలని మాలో మేము పందాలు వేసుకొన్నాము  ఇద్దరు ముగ్గురు కొట్టి ఓడిన తర్వాత మధుకూడా కొట్టాడు  అతని గురి సరిగా పోయి కాయలకు తగిలింది  కాని అవి రాలలేదు  మాలో యెవరు ఓడినా మిగతా వాళ్లందరము చప్పట్లు కొట్టూ గేలి చేస్తూ బిగ్గరగా అరచేవాళ్ళము  సరే అందరితోపాటు గోపివంతు కూడా వచ్చింది  రెండుమాట్లు కొట్టినా అతని గురి తప్పిపోయింది  అందరితోపాటు మధు కూడా నవ్వుతూ "గోపికి లేవిడీ - రెండుమాట్లూ ఓడిపోయాడు" అని అరిచాడు

గోపికి బాగా రోషంవచ్చింది  ఆఖరి ఛాన్సు అని చెప్పి యింకొకమారు గురి చూసి కొట్టాడు  అదికూడా తప్పిపోయింది  దానితో పిల్లలు బిగ్గరగా "లేవిడీ" అంటూ అరిచారు  మధుకూడా వాళ్లతోపాటే చప్పట్లు కొట్టూ అరిచాడు  ఇక గోపికి అవమానంతో కోపం అణుచుకోలేకపోయాడు  "ఇది చూడు - ఏమాత్రం గురి తప్పుతుందో" అంటూ ఆక్రోషంతో ఒక రాయి విసురుగా మధువైపు గురిచూసి కొట్టాడు  కొద్దిలోతప్పింది కాని కన్ను పోవాల్సిన దెబ్బ కణతకు తగిలి మధు పడిపోయ్యాడు  గోపి ఎక్కడికో పరిగెత్తిపోయాడు  మే మిద్దరము మధును మెల్లిగా తీసుకొనివచ్చాము

విషయమంత కమల మౌనంగా విన్నది  ఆ పిల్లల్ని యింటికి పొమ్మని చెప్పి మధును డాక్టరు యింటికి తీసుకొని వెళ్లింది  అప్పటికి యింకా గోపి యింటికి రాలేదు  వీళ్లిద్దరు తిరిగి యింటికి వచ్చేటప్పటికి గోపి యెప్పుడు వచ్చాడో దొంగలాగా మొహంమీద దుప్పటి కప్పుకొని గప్‌చిప్‌గా పండుకొని వున్నాడు  కాని కమల అతనితో ఒక మాటకూడ మాట్లాడలేదు  జరిగిన సంగతిని గురించి అసలు ప్రస్తావించనే లేదు  ఆ తర్వాత మూడు రోజులవరకు అతనితో సరిగా మాట్లాడటం మానివేసింది  నాలుగు కేకలువేసి పది దెబ్బలు కొట్టినవున్నా అతని కంత కష్టము కలిగేది కాదు  కాని యీ మూడు రోజులు ఆమె తనయెడ పూనిన మౌనవ్రతమే అతని మనస్సును దహించివేస్తూ పెద్ద భరించరాని శిక్షలాగ తోచింది  అతనికి చాల దుఃఖం కలిగింది  అంతే కాదు  తనమీద తనకే చాలా కోపం వచ్చింది  కమలకు తనమీదకంటె మధుమీదనే ఎక్కువ ప్రేమ అని, ఆమె అతని తల్లి కాబట్టి అలా వుండటం ఆమెకు సహజమేనని గోపి ఎన్నిమార్లో అనుకున్నాడు  కాని ఆమె మౌనంవల్ల అతనెందుకు యింతగా కలత చెందుతున్నాడో అతనికే అగమ్యగోచరంగా ఉంది  తనతప్పు తాను ఎప్పుడో తెలుసుకొని పశ్చాత్తాపపడ్డాడుకూడా  అయినా అతనికి అన్నపానాదులు రుచించటములేదు  రాత్రిళ్లు అనేక ఆలోచనలతో నిద్రకూడా రావటంలేదు  ఇంతవరకు కమల అతన్ని పల్లెత్తి ఒక మాటకూడ అనక యీ విషయాన్ని పూర్తిగా మరచిపోయినదానిలాగ వ్యవహరిస్తూ వచ్చింది  నాలుగో రోజున గోపి మెల్లిగా పిల్లిలాగా తల్లిదగ్గరకు వెళ్ళి తనతప్పు ఒప్పుకొని యికముందు యెన్నడూ మధుమీద చెయ్యివెయ్యనని వాగ్దానం చేశాడు  కాని ఆమెకు అంతటితో తృప్తి కలుగలేదు  అన్నదమ్ములిద్దరూ వారిలో వారికముందు ఎప్పుడూ పోట్లాడుకొనకుండా వనుకటిలాగా కలసి మెలసి ఆపేక్షగా వుంటామని వారిద్దరిదగ్గరనుంచి కూడా వాగ్దానము తీసుకొన్నది

అతర్వాత అన్నదమ్ములిద్దరూ యెన్నడూ పోట్లాడుకొనలేదు  గోపి మధుతో మునుపటికంటె యెక్కువ కలసి మెలసి అభిమానముతో మెలగసాగాడు  కాని కమలకు గోపి నడవడిక సహజముగా తోచలేదు  కేవలము తనను తృప్తిపరచేందుకే అతను ఆ విధంగా వుంటున్నాడని, మధుయందు తనకు లోలోన ద్వేషము రవ్వమాత్రమూ తగ్గలేదని, అది ఎప్పుడో వకప్పుడు ఏదో వకరూపములో పైకి పొంగితీరుతుందని, అతనికి మధుమీది ద్వేషము యెన్నటికీ పూర్తిగా సమసిపోయేదికాదని కమలకు బాగా తెలిసిపోయింది

క్రమక్రమంగా గోపిలో చాల మార్పులు కనపడసాగినయి  ఎప్పుడు గడుసుగా చురుకుగా అల్లరిచేసేవాడు పోనుపోను మితభాషి అయ్యాడు  పదిమంది మిత్రులతో తిరిగేవాడు యిప్పుడు సదా ఏకాంతంగా ఎక్కడో పొద్దుపుచ్చుకొని యింటికి వచ్చిందిమొదలు పుస్తకాలు ముందర వేసుకొని చదువులో లీనమైపోతుండేవాడు  ఈసంవత్సరము మధుపరీక్ష తప్పిపోయాడు  అందుచే యిద్దరూ ఒకచోట కలసి చదువుకొనే అవకాశముకూడ లేకపోయింది  ఎంతో అవసరముంటేనే తప్ప గోపి యింటిలోపలికి కూడా వచ్చేవాడు కాదు  ఆ యింట్లో తనొక పరాయివానిలాగా వ్యవహరించసాగాడు  కమలఆదరణ, వాత్సల్యాలు అతన్ని యేమాత్రము మార్చలేకపోయినవి

గోపి తన మనస్సులో ఏదో ఒక విచారముతో బాధపడుతున్నాడని, తనతో ఏ విషయముకూడా తెలుపక దాస్తున్నాడని కమల గ్రహించింది  అతని యీ మౌనస్థితి ఒక సుప్తజ్వాలాముఖిలాగా అతని హృదయాన్ని దహించుతూ ఎప్పుడో బయటకు పొంగితీరుతుందని అతనిని గురించి ఆమె ఎంతో ఆవేదన పడుతుండేది  తుట్టతుదకు యీ పరిస్థితి దుస్సహమై ఒకరోజు రాత్రి గోపి చదువుకొనుచుండగా కమల అతని గదిలోకి వెళ్లింది  ఆమె వచ్చినట్లు అతను గమనించలేదు  ఆ ప్రశాంత వాతావరణంలో అతని గంభీరముఖముమీద ఏవో విషాదరేఖలు సుస్పష్టంగా కనపడుతూనే వున్నాయి  కమల మెల్లిగా అతన్ని సమీపించి బుజముమీద చేతితో నిమురుతూ "గోపీ - నీవు యెందుకో చాలా దిగులుగా వున్నట్లున్నావు  కారణము నాతో చెప్పవా?" అని జాలిగా అడిగింది

హఠాత్తుగా వచ్చిన యీ ప్రశ్నకు యేమి జవాబు చెప్పాలో తోచక గోపి నిజంగానే కంగారుపడ్డాడు  కాని వెంటనే "నాకు ఏమీ దిగులు లేదే  హాయిగా బాగానే వున్నాను  పరీక్ష చదువులకోసం యెక్కువ శ్రద్ధ తీసుకుంటున్నాను అంతే" అని నవ్వులాటగా తేల్చి చెప్పాడు. కమలకు యిది కష్టము కలిగించింది

"అంటే అంతమాత్రం నేను గ్రహించలేననుకుంటున్నావన్నమాట  నీవు ఎందుకో పరాకుగా వుంటున్నావు! నీ మనస్సు నానుండి దాచాలని చూస్తున్నావు  సరే నీ యిష్టం - నేను అడిగినట్టుకు ప్రయోజనమేమి?" అని నిష్ఠురంగా అన్నది  గోపి ఏమీ మాట్లాడలేదు  ఆమె నిరాశతో బయటకు వచ్చేసింది  ఇక యెటువంటి పరిస్థితుల్లోకూడ అన్నదమ్ము లిద్దరు వెనుకటిలాగా కలసి మెలసి వుండటం అసంభవమని ఆమెకు దృఢముగా తెలిసిపోయింది  మళ్లా యెన్నడూ ఆమె యీ విషయము గోపితో ప్రస్తావించలేదు  కాని చాలకాలమువరకు యిదే ఆమె మనస్సుకు అశాంతి కలుగజేస్తూ వచ్చింది

ఆ సంవత్సరం గోపి మెట్రిక్ పరీక్షకు కూచున్నాడు  పేపర్లు చాలా బాగా వ్రాశాడు  ఫలితాలుకూడ తెలిసినయి  గోపి స్కూల్లో మొదటివాడుగా ప్యాసయినాడు  ఉపాధ్యాయులు, సహోధ్యాయులు అందరు గోపిని అభినందించారు  కమల చాల సంతోషించింది  మధుమాత్రం తనకు ఏమీ సంబంధములేనివాడిలాగా వ్యవహరించాడు  గోపి కాలేజీ చదువుకు మరొక

పట్టణానికి వెళ్లవలసివస్తుంది కాబట్టి తనకు యీ బెడద వదిలిపోతున్నందుకు సంతోషిస్తున్నట్లు కమల గ్రహించకలిగింది క్షణములకు మాత్రం గోపి యికనుండి దూరముగా వుండవలసివస్తుందనే భావన తట్టగనే చాల విచారము కలుగుతుండేది

* * *

గోపి తన భావికార్యక్రమ మేమిటో కమలకు తెలుపలేదు అతని ముఖం మాత్రం యెప్పుడూ యేదో విచారమగ్నంగా వుంటుండేది పరీక్షఫలితాలు తెలిసి నెలరోజులు దాటిపోయినది ఒక రోజు రాత్రి అందరు పడుకొన్న తర్వాత చాలసేపటినుంచి యేదో శబ్దము వస్తున్నట్లు కమలకు తోచింది రెండు మూడు సార్లు ట్రంకుపెట్టె తెరిచినట్లు మూసినట్లు కూడ ధ్వనివచ్చింది కమలకు యిదేమిటో అర్థము కాలేదు చాలసేపటిదాక మంచముమీదనే పడుకొని శ్రద్ధగా విన్నది ఆ ధ్వని గోపిగదిలోనుంచి వస్తున్నట్లు ఆమెకు అనుమానము కలిగింది చివరకు వుండబట్టలేక లేచి మెల్లిగా గోపి గదిలోకి వెళ్లింది లోపల అడుగుపెట్టి చూసేటప్పటికి ఆమె గుండె ఆశ్చర్యముతో ఆగిపోయేటంత పని అయింది !!

గోపి తన పెట్టె సర్దుకొనటంలో నిమగ్నుడైవున్నాడు ఆ ప్రక్కనే అతని పరుపుచుట్టబడి పెట్టివుండెను అతని యీ సవరణ- యీ రహస్య వ్యవహారము చూడగనే కమలకు దుఃఖము ఆగక ఏడ్పు కూడా వచ్చేసింది

ఒక్క అంగలో గోపిదగ్గరకు పోయి "గోపీ - నీవు యిప్పుడు చేస్తునపన్నియేమిటి ?" అని డాదాపు ఏడుస్తూనే అడిగింది

"తయారీ" అని గోపి చాల గంభీరంగా జవాబు చెప్పాడు ఒక్కటేమాట అతను మాట్లాడింది అయినా ఆ ఒక్కమాటే కమలహృదయాన్ని ఛేదించేసింది

"ఏ తయారీ ? ఎందుకు ?" గద్గద స్వరంలోనే అడిగింది

"అ - ఏమీ లేదు ఒక వూరికి వెళ్తున్నాను ఉద్యోగంకోసం రెండు మూడు దరఖాస్తులు దాఖలుచేశాను ఇవ్వాళే ఒక చోటనుంచి నాకు వుద్యోగము యిచ్చినట్లు వుత్తరము వచ్చింది నెలకి యాభై రూపాయలు యిస్తారు ఎల్లుండినుండి పనిలో ప్రవేశించాలి" గోపి శాంతంగా నిశ్చలతతో చెప్పాడు

కమల యేమీ మాట్లాడలేదు గోపి కఠోర నిశ్చలత, శాంతగంభీరత ఆమెకు సహింపరానిదైంది. ఆమె నేత్రాలలో నీరు నిండింది గోపి వెనుకటి నిశ్చలస్వరంలోనే యిలా అన్నాడు

"అమ్మా, నీవు చిన్నప్పటినుండి యింత వరకు అన్నివిధాలా ఆదరించావు పెంచావు పెద్దవాణ్ణి చేశావు చదువు చెప్పించావు అన్నిటికంటె యెక్కువగా- చాలా ఔదార్యంతో - నీ స్వంత కన్న బిడ్డలాగా ప్రేమించావు నీ మేలు నేను యెన్నటికీ మరువలేను యెన్ని జన్మలు యెత్తినా తీర్చుకొనలేను " ఇక్కడ గోపి కంఠం వణకసాగింది తన హృదయ భారాన్ని అణచుకుంటూ యింకా యిలా అన్నాడు "అమ్మా - నాకు చాల సంవత్సరాలనుండి తెలుసు నీవు నానుండి దాస్తూ వచ్చావు నీవు నా తల్లివి కావనేసంగతి నాకు యెప్పుడో తెలిసిపోయింది మధు నీ కొడుకనీ - నేను కళ్యాణి కొడుకుననీ "

"గోపీ - చాలించు - ఇక చాలించు—" కమల ఆవేశంతో ఉద్విగ్నయై అరచింది - "యెవరు చెప్పారు నీకు యిది — ఎవరెక్కించారు యీ పిచ్చి - నీ తలలో"

గోపి నిశ్చలంగానే వున్నాడు నిదానంగా చెప్పాడు ఐదారు సంవత్సరాల సంగతి పూసగుచ్చినట్లు చెప్పి "అమ్మా, నీవు మానుంచి యెంత దాచినా వూరి మొత్తానికి పూర్తిగా తెలిసివున్న సమాచారము మాకు తెలియకపోలేదు" అన్నాడు నిరాశాపూరిత దుఃఖముతో

"గోపీ - గోపీ - నీ వెంత తెలివితేటలు కలవాడవు - ఎంత పిచ్చివాడవు - ఈరోజు వరకు నీకు తెలిసిందనుకుంటున్న సంగతంతా పూర్తిగా అబద్ధం—"

"అబద్ధమా ? అబద్ధమా ? అంటే మే మిద్దరము కూడా నీ బిడ్డలమేనా ?"

"కాదు " అని కమల ఒక క్షణం ఆగింది

"అయితే " గోపికి ఆ ఒక్క క్షణమే ఒక యుగంలాగా తోచింది

"నీవే నా కుమారుడివి మధు కళ్యాణి కొడుకు " కమల అత్యంత సావకాశంగా తెలియజేసింది

"ఏమిటీ ? నిజంగానా - అమ్మా ? నేనే నీ కొడుకునా !!!-" ఆశ్చర్య ఆనందాతిరేకాలతో గోపి ఒక్క దూకులో వెళ్లి కమల ఒడిలో వాలిపోయాడు "అమ్మా - అమ్మా ! నేను యివ్వాళ యెంత గొప్ప అపరాధము చేసివుండేవాడిని !! నీకు చెప్పకుండానే యీరోజు రాత్రి బయలుదేరి వెళ్లివుండేవాడిని !! కాని అమ్మా - యింత కాలమునుండి నాకు యీ సంగతి యెందుకు తెలియచేయలేదు ?" గోపి యింకా తన ఆనందాన్ని మరుగుపరచలేక అడిగాడు

"మధుకోసరం" కమల కన్నీరు తుడుచుకుంటూ చెప్పింది

"అంటే" గోపి ఆదుర్దాగా అడిగాడు

"గోపీ నీకు తెలుసుగదా - మధు యెంత సున్నితహృదయము కలవాడో ! అతను నామీద యెంత ఆధారపడి వుంటున్నది నీకు తెలియనిది కాదు నేను అతని తల్లిని కాదని తెలిస్తే అతనికి ఎంత వ్యథ కలుగుతుందోగదా ? పాపం అత డెక్కడికి వెళ్లగలడు ? లేక యెవరిని ఆశ్రయించి వుండకలడు ? - అంతేకాక నేను కళ్యాణి మృతాత్మకు పవిత్రవాగ్దానము చేశాను గోపీ - నీ యీర్ష్యకలవ మధును కష్టపెట్టావు - నీవు చాల బాధపడ్డావు - ఇందువలన నా హృదయములో యెంత ఘోరసంఘర్షణ చెలరేగిందో నీ కేమైనా తెలుసా ?"

కమల యిక మాట్లాడలేకపోయింది. కళ్యాణిపవిత్రమూర్తి తన కంటియెదుర లీలగా గోచరమైనట్లు తోచింది తనపై నుంచిన యీ గురుతర బాధ్యతను సర్వోత్తమంగా పాలించినందుకు ఆమె తనను దీవిస్తున్నట్లు తలచింది కన్నీరు తుడుచుకుంటూవుండగా ఆమె దృష్టి అప్రయత్నంగా యెదురుగా వున్న గుమ్మంపై ప్రసరించింది

అక్కడ యెదురుగా మధు గుమ్మము వద్ద నిలబడివున్నాడు !!! - ఆమె నిశ్చేష్ట అయింది !! ఆమె భీతదృష్టితోనే మధు వైపు చూసింది !!

అతని నేత్రాల్లో కృతజ్ఞతాపూరిత అశ్రువులు మెరుస్తున్నాయి జాలికొల్పే అతని దీనవదనము చూడగనే ఆమెకు దుఃఖము ఆగలేదు

"మధూ - నీవు మా సంభాషణ అంతా విన్నావా ?" అని కమల దుఃఖములోనే అడిగింది

"ఆ అంతా విన్నాను " మధు మెల్లిగా అన్నాడు

"మధూ " ఈ ఒక్కమాట మాత్రము కమల అతి కష్టముమీద అనగల్గింది

"అమ్మా" అని మధు అస్పష్టంగా అన్నాడు మరుక్షణంలో వచ్చి కమల ఒళ్లో వాలాడు ★

**కుష్ఠు ★ బొల్లి**

వగైరా మేహముచ్చులు, సెగ, సవాయి వ్యాధులకు, గ్యారంటీ చికిత్స, క్యాటలాగు ఉచితం జి వి రెడ్డి అండ్ కో., (రిజిష్టర్డు) "భాస్కరాశ్రమము" గోపాలపురం, తూ గోదావరి